AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com


పల్లెల్లో బడిబాట సందడి..




2



2

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై గురువారం భారీవృక్షం నేలకూలింది. స్థానిక వడ్డెర కాలనీ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. – అక్షరటుడే, ఎల్లారెడ్డి



## ఎమ్మెల్యే రాజీనామా చేయాలి



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలో వంతెన నిర్మించలేనందుకు బాధ్యతగా ఎమ్మెల్యే రాజీనామా చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బొల్లారం క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో పాముల వాగు వంతెన వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మండలంలోని లింగంపల్లి కుర్దు వద్ద గతేడాది కురిసిన భారీ వర్షాలకు పాముల వాగు వంతెన తెగిపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా వంతెన నిర్మించకపోవడంతో తాత్కాలిక వంతెనతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్దేశ్, విష్ణు, సంగీత, సుభాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య




**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో అశోక్ అన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా నగరంలోని బోర్గాం(పి) ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. నాణ్యమైన చదువు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు ఇలా అన్ని సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నాయన్నారు. అనంతరం ఎంఈవో తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటి సాధనకు ముందుకు కదలాలన్నారు. కార్పొరేటర్ యాదాల నరేష్ మాట్లాడుతూ బోర్గాం(పి) ఉన్నత పాఠశాలకు జిల్లాలోనే మంచి పేరు ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు, విద్యాస్థితి, వివిధ అంశాల్లో పాఠశాల చేపట్టిన కార్యక్రమాలను ఆడియో, వీడియో రూపంలో హెచ్ఎం శంకర్ తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు జమున, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా రెవెన్యూ అధికారిణికి సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లా రెవెన్యూ అధికారిణి గీత రెవెన్యూ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయంలో గురువారం టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, దేవి సింగ్, పృథ్వీ, కిషన్, అరుణ, ప్రశాంత్, నితిన్, అశోక్, అమృత్, రమేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ పదవులకు దరఖాస్తులు



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్‌లో పదవులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గురువారం కాంగ్రెస్ భవన్‌లో ఎస్సీ సెల్ జిల్లా అబ్జర్వర్ చుక్కా శ్రీనివాస్, డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో ఛైర్మన్, ఇతర పదవుల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ లింగం, నగర ఛైర్మన్ వినయ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, రాజ్ గగన్, రాజేష్, దేగాం ప్రమోద్, శాంతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు



జిల్లాలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. బంగారం ధరలు భారీగా పెరగడంతో గొలుసు దొంగతనాలు సైతం పెరిగాయి. ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. బైక్‌లపై వచ్చి చైన్‌లను లాక్కెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు చిక్కకుండా కొత్త మార్గం ఎంచుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దొంగలు మొదట స్థానికంగా ఓ బైక్‌ను దొంగతనం చేస్తున్నారు. ఆ బైక్‌తో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. అనంతరం ఆ బైక్‌ను వదిలేసి పరారవుతున్నారు.

- అక్షరటుడే, భీమ్‌గల్

■ పోలీసులకు చిక్కకుండా ప్లాన్
■ చోరీ చేసిన వాహనాలతో స్నాచింగ్ ■ ఆందోళన చెందుతున్న ప్రజలు

జిల్లాలో ఇటీవల గొలుసు దొంగతనాలు పెరిగాయి. అయితే నిందితులు అనుసరిస్తున్న కొత్త పద్ధతి పోలీసులకు సవాల్‌గా మారుతోంది. తొలుత ఒక ప్రాంతంలో వాహనాన్ని చోరీ చేయడం, అదే వాహనాన్ని ఉపయోగించి మరోచోట గొలుసు దొంగతనాలకు పాల్పడడం ఈ ముఠా పనితీరుగా కనిపిస్తోంది. దొంగతనం చేసిన తర్వాత సీసీ కెమెరాల ద్వారా పోలీసులు తమను పట్టుకుంటారనే భయంతో నిందితులు ఈ ఎత్తుగడ వేస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దుల నుంచి వస్తున్న ముఠాలు జిల్లాలో తొలుత ద్విచక్ర వాహనాలను తస్కరిస్తున్నాయి. ఆ వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా పోలీసులు అసలు దొంగలను గుర్తించడం కష్టమవుతోంది. పని ముగిసిన తర్వాత ఆ వాహనాన్ని నిర్జన ప్రదేశాల్లో వదిలేసి, తాము తెచ్చుకున్న వాహనాల్లో సరిహద్దులు దాటుతున్నారు.

### గతంలో జరిగిన ఘటనలు

కొన్ని నెలల క్రితం వినాయక్‌నగర్‌లో ఒక వాహనాన్ని ఎత్తుకెళ్లిన దొంగలు, అదే బండిపై వెళ్లి శ్రీనగర్‌లో ఓ మహిళ మెడలో గొలుసు తెంచుకుపోయారు. గతేడాది డిసెంబరులో ముగ్గురు దొంగలు చోరీ చేసిన బైక్‌లపై వచ్చి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని బంగారు దుకాణాల్లో 33 తులాల బంగారం, 7 కిలోల వెండిని దోచుకెళ్లారు. దొంగలు మహారాష్ట్ర నుంచి వచ్చి ఇక్కడ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. జిల్లాలో గత నాలుగేళ్లుగా జరిగిన 145 చెయిన్ స్నాచింగ్ కేసుల్లో కేవలం 33.7 శాతం మాత్రమే రికవరీ కావడం గమనార్హం.

### అడ్రస్ అడుగుతూ మోసం

మహిళలు ఒంటరిగా నడిచే సమయాన్ని దొంగలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు, గుడికి వెళ్లే మహిళలే వీరి ప్రధాన లక్ష్యం. అడ్రస్ అడుగుతున్నట్లుగా నటించి, మాటల్లో దించి క్షణాల్లో మెడలోని చైన్‌ను తెంచుకుపోతున్నారు. ముఖ్యంగా ఆర్మూర్, బోధన్, వినాయక్ నగర్, గాయత్రీనగర్, సుభాష్ నగర్, వంటి ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.

### అప్రమత్తతే శ్రీరామరక్ష!

దొంగతనాల నియంత్రణకు పోలీసులు గస్తీ పెంచుతున్నప్పటికీ, ప్రజల అప్రమత్తత అత్యవసరమని అధికారులు సూచిస్తున్నారు. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ కాకుండా సురక్షితమైన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలి. బయటకు వెళ్లేటప్పుడు బంగారు గొలుసులు బయటకు కనిపించకుండా చీర కొంగు లేదా చున్నీతో కప్పుకోవాలి. కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

## జనగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో కొనసాగుతున్న జనగణన సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. రాజంపేట మండలంలో సెన్సస్ 2027 జనగణన ఇంటింటి సర్వేను గురువారం పరిశీలించారు. సర్వే నిర్వహణ, డేటా సేకరణ తీరును సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని కవర్ చేస్తూ వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమని, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఇంటిని దగ్గరుండి పరిశీలించారు. రాజంపేట మండల కేంద్రంతో పాటు ఆర్గొండ, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లోని వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు, లోడింగ్, లిఫ్టింగ్ ప్రక్రియను సమీక్షించారు. రైతులకు ఇబ్బంది లేకుండా లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాంటా వేసి ధాన్యాన్ని వెంటనే గోదాములు, మిల్లులకు తరలించాలన్నారు. ఆర్గొండ పీఏసీఎస్ కేంద్రంలో లారీ లోడింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ట్యాబ్ ఎంట్రీలు వేగవంతం చేయాలని, వర్షాల వల్ల నష్టం జరగకుండా ధాన్యం భద్రపరచాలని మార్క్‌ఫెడ్ డీఎం, ఇతర అధికారులకు సూచించారు.

## బక్రీద్‌కు పటిష్ట భద్రత



**అక్షరటుడే, కామారెడ్డి:** రానున్న బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 24 గంటలు పని చేసే ప్రత్యేక జిల్లా పోలీస్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రధాన సరిహద్దు ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఎస్పీ వివరించారు. అనుమానాస్పద ఘటనలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 87126 86133 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వాహనాలను ఆపడం, తనిఖీలు చేయడం వంటి అధికారం కేవలం ప్రభుత్వ విభాగాలకే ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. వ్యక్తులు లేదా సంస్థలు స్వయంగా తనిఖీలకు దిగితే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సహకరించాలని కోరారు.

## నగరానికి రింగ్‌రోడ్డు కేటాయించకపోవడం దురదృష్టకరం: ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరానికి రింగ్ రోడ్డు కేటాయించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే ధన్‌పాల్ అన్నారు. రాష్ట్రంలో మూడు జిల్లాలకు కేటాయించారని.. అందులో నిజామాబాద్ పేరు లేదన్నారు. నగరంలోని ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా కాలనీవాసులు ఐక్యతతో కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలోకెల్లా అత్యధికంగా వ్యాపారులు, మేధావులు, విద్యావంతులు ఎన్జీవోస్ కాలనీలోనే ఉన్నారన్నారు. అందరి కృషితోనే అద్భుతమైన నిర్మాణం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారం కూడా ఉండాలని, తన ఎమ్మెల్యే ఫండ్ వచ్చిన తర్వాత తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. తన ట్రస్ట్ ద్వారా సాయం అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇప్పటికే పాత పనులపై అనేకసార్లు మంత్రులు, అధికారులను కలిశానన్నారు. త్వరలోనే సీఎంని కలిసి నగరాభివృద్ధి కోసం లేఖను అందించనున్నట్లు చెప్పారు. ఎలక్షన్ల ముందే రాజకీయమని, తర్వాత అందరినీ కలుపుకొని అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ సహకారంతో కేంద్ర నిధులు పుష్కలంగా అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అతిపెద్ద నగరం నిజామాబాద్ అని, అయినా రింగ్‌రోడ్డు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేటర్లు జ్యోతి, మురళి, నాగోల్ల లక్ష్మీనారాయణ, పరమేశ్వర్, మఠం పవన్, ప్రవీణ్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు పోతనకర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వాసు, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటను వెనువెంటనే గోడౌన్లకు తరలించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రైతుల పంట ఉత్పత్తులను సేకరించిన అనంతరం వెనువెంటనే గోడౌన్లకు తరలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మోపాల్ మండలం శ్రీరాంనగర్ తండాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. అలాగే శ్రీనగర్ శివారులోని గోడౌన్‌ను సైతం సందర్శించారు. ముందుగా కొనుగోలు కేంద్రంను తనిఖీ చేసిన కలెక్టర్.. రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. మొక్కజొన్న పంట నాణ్యత, తేమ శాతంను స్వయంగా పరిశీలించిన ఆమె.. ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్ ద్వారా తూకం సరిగా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని తెలుసుకున్నారు. రైతులు పంట ఉత్పత్తులు కేంద్రానికి తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను వెనువెంటనే గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున త్వరితగతిన మొక్కజొన్న నిల్వలను గోడౌన్లకు తరలించి జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. అవసరమైన సంఖ్యలో హమాలీలను సమకూర్చుకుని, మొక్కజొన్న రవాణాలో జాప్యానికి తావులేకుండా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నిర్దిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు ఏ దశలోనూ అసౌకర్యం కలగకుండా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. అనంతరం శ్రీనగర్‌లోని గోడౌన్‌ను కలెక్టర్ సందర్శించారు.



మొక్కజొన్న నిల్వల అన్‌లోడింగ్ తీరును, మొక్కజొన్న బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రేఖ నాయక్, ఎంపీడీవో నరేష్, మార్క్‌ఫెడ్ సిబ్బంది భాస్కర్ తదితరులున్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలి



**అక్షరటుడే, ముప్కాల్:** విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలని కర్ణ ఫౌండేషన్ ముఖ్య అతిథి రాణా ప్రతాప్ అన్నారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నవోదయకు ఎంపికైన తేలు సహస్రను శాలువాతో సన్మానించారు. అలాగే గురుకులాలకు ఎంపికైన 28 మంది విద్యార్థులను అభినందించారు. అనంతరం కర్ణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రంజిత్ గౌడ్, చిట్టి పటేల్, ప్రధానోపాధ్యాయులు శైవ శ్రీనివాస్ ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గంగా ప్రసాద్, ఎస్ఎంసీ సభ్యులు నవీన్, ఉపాధ్యాయ బృందం, సతీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పూర్తిచేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** వడ్లు, మక్కల కొనుగోలు సెంటర్లలో కాంటాలు త్వరగా పూర్తిచేయాలని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ శివారులో గురువారం కిసాన్ సంఘ్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు చేయడానికి లారీలను వెంటనే పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనంద్ రావు, రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి అంజన్న, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సాలుగారి సాయి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.





# పల్లెల్లో బడిబాట సందడి..

■ ఇంటింటికీ వెళ్తూ సర్కారు స్కూళ్లపై అవగాహన ■ డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి ■ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఉపాధ్యాయులు

**విద్యార్థులను బడుల వైపు నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు ఆర్మూర్, వేల్పూర్, మాక్లూర్, బాల్కొండ, మెండోరా, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ముప్కాల్ మండలాల్లో అధికారులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

ఆర్మూర్ డివిజన్‌లో బడిబాట నిమిత్తం అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కాలనీలు, తండాలు, గూడెంలలో పర్యటిస్తూ 516 ఏళ్ల లోపు పిల్లల వివరాలు సేకరిస్తున్నారు. బడిమానేసిన పిల్లలు, ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లని పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు..

ఆర్మూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ ఛైర్ పర్సన్ గోనె లహరి ఆధ్వర్యంలో బుధవారం విద్యా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటూ ఆమె విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు కమిషనర్ పర్యవేక్షణలో వార్డుల వారీగా ర్యాలీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తున్నారు. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లపై అవగాహన కల్పిస్తున్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీలో మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు బడిబాట ర్యాలీలో పాల్గొని తల్లిదండ్రులకు కరపత్రాలు పంచారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

### ప్రధాన లక్ష్యాలివే..

2026-27 విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా బడికి దూరం కాకూడదనే లక్ష్యంతో బడిబాట బృందాలు ప్రయత్నిస్తున్నాయి. అలాగే డ్రాపౌట్లను తగ్గించడం.. వలసలు, ఆర్థిక ఇబ్బందులతో బడి మానేసిన వారిని తిరిగి చేర్పించడంపై దృష్టి పెట్టాయి. స్కూళ్లలో వసతులపై భరోసానిస్తూ మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందుతాయని తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పిస్తూ



అడ్మిషన్లు చేయిస్తూ వారు ముందుకు కదులుతున్నారు.

### ప్రత్యేకంగా రాత్రి బడిబాట..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా రాత్రిళ్లు సైతం బడిబాట కార్యక్రమానికి ఆర్మూర్ ఎంఈవో రాజా గంగారం శ్రీకారం చుట్టారు. తల్లిదండ్రులు అందుబాటులో ఉండే రాత్రి సమయంలో ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ జిల్లాలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

## బడిబయటి పిల్లలను స్కూళ్లకు పంపాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బడిబయటి పిల్లలను స్కూళ్లకు పంపాలని ఎంఈవో రాజులు సూచించారు. మండలంలోని మాచాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నామని వివరించారు. పిల్లల భవిష్యత్తుకు చదువే పునాది అని, ప్రతిఒక్కరూ తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని ఎంఈవో రాజులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో గురువారం 'మన ఊరు - మన భద్రత - మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లా సాయిరెడ్డి, వార్డు మెంబర్లు, ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు, షీటీం ప్రతినిధులు పాల్గొన్నారు.



## పోల్కంపేట్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోల్కంపేట గ్రామంలో గురువారం సీసీ కెమెరాలను ఎస్సై దీపక్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామం మొత్తం నిఘా వలయంలో ఉంటుందన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా నేత్రాలు కాపలా కాస్తాయని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచ్‌ను ఎస్సై అభినందించారు. అనంతరం గ్రామస్థులు ఎస్సైని సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## ఉత్తమ విద్యార్థులకు సన్మానం



**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని చేపూర్ హైస్కూల్ పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులను స్ఫూర్తి సేవా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండవీటి శ్యాంప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రతి ఏడాది విద్యార్థులకు స్ఫూర్తి సేవా సొసైటీ అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, పరీక్షలకు ముందు, తర్వాత విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రాస ఆనంద్, సర్పంచ్ శాంతి కుమార్, ఉపసర్పంచ్ చరణ్, పాఠశాల హెచ్‌ఎం చేతన కుమారి, వీడీసీ అధ్యక్షుడు మినుగు నాగరాజు, కోశాధికారి శ్రీనివాస్, చేపూర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్ సమీక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో తాగునీటి సరఫరాపై కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ మేరకు ఆయన కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. నగరంలోని 12, 41వ డివిజన్‌లో కమిషనర్ గురువారం పర్యటించారు. డివిజన్‌లోని ఆయా కాలనీల్లో తిరుగుతూ తాగునీటి సరఫరా, శానిటేషన్ జరుగుతున్న తీరుపై అధికారులతో మాట్లాడారు. అలాగే ఆయా కాలనీల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. ఖాళీ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ నీటిసరఫరాలో ఎక్కడా అంతరాయం ఏర్పడకూడదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ, డీఈలు, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి వరకు హోటల్ ఓపెన్.. రెండు రోజుల జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో అర్ధరాత్రి వరకు హోటల్‌ను తెరిచి ఉంచిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. నగరంలోని మాలపల్లిలోని ఓ హోటల్‌ను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి స్పెషల్ సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి ఎదుట గురువారం హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో రఘుపతి మాట్లాడుతూ ఎవరైనా నిర్ణీత సమయం దాటి పాన్ దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు తెరిచి ఉంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఎన్ఆర్ఐ మోతె సూరజ్ రెడ్డి దంపతులు శిబిరంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ మాట్లాడుతూ.. గతంలో సూరజ్ రెడ్డి, సురక్షిత్ రెడ్డి సోదరులు 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆర్థికసాయం అందజేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మోతె సురక్షిత్ రెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ ఎన్.అంజయ్య, అర్మూర్ కోర్టు సూపరింటెండెంట్ జి.రమేష్, గంగారాం, కబడ్డీ కోచ్ సాయిలు, నర్సయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'నీట్' నిర్వహణలో కేంద్రం విఫలం

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలో గురువారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 22లక్షల మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో లింగంపేట్ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ సుల్తాన్, సోషల్ మీడియా ప్రతినిధి బెస్త నవీన్, చాకలి కుమార్ రాజేష్ గౌడ్, గుని ఎల్లేశం, ఫయాజ్, రాజు, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, కామారెడ్డి:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ ఘటనపై కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఇందిరాగాంధీ చౌక్ వద్ద యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాస్తుంటే.. పేపర్ లీక్‌లతో వారి జీవితాలు దెబ్బతింటున్నాయన్నారు. నీట్ లాంటి కీలక పరీక్షలు లీక్ జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని, దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడుతుంటే కొందరు అక్రమాలకు పాల్పడి వ్యవస్థను అపవిత్రం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, పారదర్శక పరీక్షా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, రూరల్ అధ్యక్షుడు రాజా గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు గంప ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామ్ కుమార్, షేరు, సిద్దిక్, యూనుస్ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.